# "ఆడ—మగ"

రచన:
శ్రీ నానుబాల రాజగోపాల్

రంఘునాథం మెట్లెక్కాడు. తలుపుకొట్టి భార్యను పిలచాడు. లోపలనుంచి జవాబులేదు. అనాలోచితంగా తలపైకెత్తి చూచాడు. గడియకి తాళంవేసిఉంది. గతుక్కుమన్నాడు. ఆమె ఎక్కడికి వెళ్ళియుంటుందని ఇరుగుపొరుగు వాళ్ళను అడగాలనుకున్నాడు. కాని అడుగుటకు, అతనికి మనసొప్పలేదు. త్వరలో వచ్చేస్తుందని అభిప్రాయపడ్డాడు. కాని ఎంతకీ రాక పోవడంచూచి ఆవేళ బుధవారం అవడంవలన మ్యాటనీకి వెళ్ళియుంటుందని పసిగట్టాడు. అతడు అసలే అనుమానపు మనిషి అవడంవల్ల తాను ఇంట్లో లేనివేళలలో ప్రతీరోజు ఇట్లాగే చక్కెరకొడుతుందా అన్న అనుమానం అతనికి రాకపోలేదు. కొంపతీసి ఎదురింటి సుందరంగారింటికి వెళ్ళడంలేదుగదా! ఆఇంట్లోని వారందరు కాలేజీ కుర్రవెదవలే...కొంపతీసి ఆవెదవలుగాని చొరవచేసుకోరుకదా! ఇటువంటి అనుమానాలతో అతని మనస్సు కలవరపడసాగింది. అందుచేతనే అతను ఈఊరు వచ్చేకొత్తలో భార్యను హెచ్చరించాడు..."ఒసేయ్...జాగ్రత్త ... వీదిలోకి రాబోకుసుమా...తలుపులు వేసుకుంటూయుండు...అసలే రౌడీ ఊరు ఎవరైనా ఎర్రగా బుర్రగాయుంటే చాలు... ఎలక్ట్రిక్ దీపంచుట్టూ చేరిన పురుగుల్లా తిరుగుతారు..."

అమ్మగారి పేరని లెటర్‌సార్ అని పోష్టుజవాను పిలిచేసరికి రంఘునాథం ఈలోకంలో పడ్డాడు. రంఘునాథం లెటర్ తీసుకొని చదవనారంబించాడు.

ప్రియమైన రమకు,

నీయొక్క లేఖకు వేగిరంగా జవాబివ్వలేనందుకు క్షమించమని ప్రార్థిస్తూయున్నాను. ఇప్పుడు నీకు లేఖ వ్రాయుటకు సదవకాశం లభించినందుకు నేనెంతో సంతసిస్తూయున్నాను. ఈమధ్యను నాకు క్యాంపులు. ఆఫీసుపని ఎక్కువగా ఉండడంవల్ల ఉత్తరం వ్రాయలేకపోయాను. ఆఫీసు పనిమీద మీఊరు వస్తూయున్నాను. బుదవారంనాడు రాత్రిబండికి మీఇంటికి వచ్చెదను అప్పుడు ముఖాముఖిగా కలుసుకొని మిగిలిన సంగతులు మాట్లాడుకొందము. నాగురించి శ్రమపడి వంటప్రయత్నమేమిచేయవద్దు. ఇంతేసంగతులు.

ఇట్లు :
నీ లక్ష్మీప్రసాద్:

రంఘునాథం ముఖం ఎర్రబారింది. కవరు జేబులో పెట్టాడు. పళ్ళు పటపట కొరికాడు ఒక్కసారిగా వెళ్ళి తన భార్యమీదపడి పీకనులిపి చంపేద్దామా అనిపించింది. "లక్ష్మీ ప్రసాదట. దరిద్రపువెదవ...నా పెళ్ళానికి ప్రేమలేఖ వ్రాస్తాడా...ఇడియట్ ...పోస్టుద్వారా" "లవ్‌కరస్పాండెన్సు" చేస్తున్నాడు... ఎంతసాహసం వీడికి. వీడితో దీనికి పరిచయం ఏర్పడి ఎన్నాళ్ళయిందో! అందుచేతనే ఈదౌర్భాగ్యపుముండ మాట్లాడితే పుట్టింటికి పోతానంటుంది. అక్కడెవడిని జతపర్చుకుందో. రంకులాడి. నాకళ్ళుకప్పి నాముందే చదరంగమాడాలనుకుంది. ఇహ ఈలక్ష్మీప్రసాద్‌గాడి భూపాలం నేపాలం చేసేస్తాను. లక్ష్మీప్రసాద్‌గాడెవడో పసిగట్టి, ఈ మహాపతివ్రతగారి అంతు తేల్చాలనుకొన్నాడు. చేతిగడియారం ప్రక్క చూచాడు. సమంగా 6 గంటలయింది. సినీమానుంచి మనుష్యులు గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఇహ తానక్కడ నిల్చుంటే నడపవలసిన కార్యక్రమం సాఫీగా జరగదనే ఉద్దేశంతో ఆచోటనుంచి నిష్క్రమించాండు.

రమ మ్యాటనీనుంచి వచ్చింది. పదినిముషములు గడచిన తరువాత రంఘునాథంకూడ వచ్చాడు. ఏమండి ఈవేళ ఇంతఆలస్యంగా వచ్చేరు. అని ప్రశ్నించింది అతనిభార్య...హా...ఏమీలేదు...ఆఫీసులో పని ఎక్కువగా వుండడంవల్ల...అవునట్లు ఈవేళ ఎనిమిదిగంటలకి క్యాంపువెళ్ళాలి" అని చెప్పతూ లెదర్‌సూట్‌కేసులో ఒకజతబట్టలు సర్దుకొని, బోజనంచేసి వెలుదురుగాని అని భార్యచెబుతున్నా వినిపించుకోకుండా గడప దాటాడు.

(తరువాయి 24 వ పేజిలో)

(6 వ పేజి తరువాయి)

అది అమావాశ్య అర్ధరాత్రి. చీకటి దట్టంగా అల్లుకొనియుంది నిర్మానుష్యం. కీచురాళ్ళ చప్పుడు తప్ప మరేమీ వినిపించలేదు. అప్పుడప్పుడు నక్కల అరుపులు మాత్రం దూరంనుంచి వినిపిస్తున్నాయి. రంఘునాథం మెల్లగా ఇంటికి కుడిప్రక్కనున్న దట్టంగా అల్లుకొనియున్న మల్లి పందిర క్రింద దాక్కున్నాడు. దుబ్బుగా పెరిగిన క్రోటన్సు చెట్లు అడ్డంగా యుండడం వల్ల అతడు మరెవరికి కనబడడు. ఆవిధంగా రంఘునాథం కూర్చొని పదినిముషములయింది. ఇంతలో వీది గుమ్మంలో గుర్రపుబండి ఆగిన చప్పుడయి అటు ప్రక్క చూచాడు. ఎవరో నిండుగా కోటువేసుకొన్న అప్ - టు - డేట్ వ్యక్తిచేతిలో హాండ్ బ్యాగ్‌తో సహా బండిలోనించి క్రిందకి దిగాడు. రంఘునాథం గుడ్లప్పగించి చూచాడు ఎవరా అని. అతడు ఎకాఎకిగా వెళ్ళి తలుపు కొట్టి "రమ" అని పిలిచాడు. రంఘునాథం శరీరం మీద తేళ్ళు జెర్రెలు పాకినట్లయింది. పళ్ళు పటపట కొరికాడు "రమట. ఇడియట్ స్వంత పెళ్ళాం లాగున పిలచాడు. చేతిలో రివాల్వ రుంటే కాల్చిపారేద్దును. అదృష్టమంతుడయిపోయాడు.

తలుపులు తెరచుకొన్నాయి. ఆ నూతనవ్యక్తి అమాంతంగా రమను కౌగలించుకొన్నాడు. వాళ్ళిద్దరు ఒకరి నొకరు ముద్దిడుకొన్నట్లు అంత స్పష్టంగా కాకపోయిన సందేహంలేనట్లు అతనికి కనబడింది. ఇక అదృశ్యాన్ని చూడలేక రంఘునాథం కళ్ళు మూసుకొన్నాడు. ఇంతలో రమ తలుపు గడియవేసింది. దానితో రంఘునాథానికి గాయం మీద కారం చల్లినట్లయింది. వెన్నెముక విరిగిపోయిందా అనిపించింది. మెల్లగా వెళ్ళాడు తలుపుదగ్గరకి తలుపుకి దగ్గరగా చెవిపెట్టి వినడానికి ప్రయత్నించాడు లోపల ఏమిటి మాట్లాడుకొంటున్నారాయని కాని వారిద్దరు లోపల గదిలో యుండడంవల్ల ఏమియు వినబడడం లేదు. రంఘునాథం గట్టిగా తలుపుకొట్టి రమ అని పిలచాడు. అప్పుడు అతని కంఠధ్వని కోపంతో నిండియుంది. రమ తలుపుతీసింది. బోనులోనుంచి పైకివచ్చిన పెద్దపులిలా రంఘునాథం గదిలో ప్రవేశించాడు కుడిచేతిలోని బాకు తళతళమని మెరుస్తుంది. రమ వణకిపోయింది: ఏడి ? ఆ వెధవ ఎక్కడ అని. గదంతా దద్దరిల్లేటట్లు అరచాడు. అతని ఉగ్రస్వరూపాన్ని చూచి ఆమె వణకిపోయింది. ఎక్కడ దాచేవే వాడిని ? అని మళ్ళ గర్జించాడు. ఈ సారి రమ కాస్త ధైర్యం తెచ్చుకొని ఎవరండీ? ఏమిటి మీ అనుమానం అని అడిగింది. హ... ... ఇంకా తెలియలేదనుకున్నావా ఎన్నాళ్ళు దాగుతుందే రంకు తనము దొంగతనమూను. చెప్పుత్వరగా చెప్పు అని రెట్టించి అడిగాడు. ఈ సారి ఆమెకు కోపం చిరాకు రెండూ పుట్టాయి. ఏమిటండీ నేనేమి తప్పు పనిచేశానని. ఆమాట పూర్తికాలేదు ఆమె చెంప చెళ్ళుమంది. నేను చూడలేదనుకున్నావా. ఇదిదో ఉత్తరం. ఇప్పుడు జట్కాలో నుంచి దిగిన ఆ వెధవ ఏడి ? ఈ మాట వినగానే ఆమెకు దుఃఖంపోయి ఆపుకోలేనంత నవ్వు వచ్చింది. ఇంతలో 25 సం॥ ల వయస్సు గల ఒక యువతి వాళ్ళ దగ్గరకివచ్చి ఏమిటీ అట్లా పోట్లాడుకొంటున్నారు అని అడిగింది. రమ జవాబివ్వకుండా పకపక నవ్వడం మొదలు పెట్టింది. ఆమె కిదంతా అర్థంకాక తెల్లబోయి చూస్తుంది. రమ ఉత్తరం ఆమె చేతికిచ్చింది. ఆమె ఉత్తరం తీసుకొని ఔను . . . . . . ఇది నేను వ్రాసినదే అన్నది. రంఘునాథం ఒక్కసారి ఆశ్చర్యంతో ఆమె ప్రక్క తిరిగాడు. ఏమిటి ఇది మీరు . . . వ్రాసి . . . నదా అని తడబడుతూ అడిగాడు. . . ఔను అని అంది. అయితే లక్ష్మీ ప్రసాద్ ఎవరు ? "ఆడ - మగ" . . . . . . అది నేనే. నా పేరు లక్ష్మి మావారిపేరు ప్రసాద్. మొత్తం పేరు లక్ష్మప్రసాద్. నేను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సుగా పనిచేస్తున్నాను. ఈ మాట వినేసరికి రంఘునాథం ముఖం "డాలర్ ఆముదం" త్రాగిన వాడి ముఖంలా తయారయింది.